## క్లుప్తంగా

### సోనియాపై కేసులు దారుణం



మాట్లాడుతున్న యార్లపల్లి గోపి

తిరుపతి సిటీ : సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమంగా ఈడీ కేసులు పెట్టడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షుడు యార్లపల్లి గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేతలతో బీజేపీ వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు.కేంద్ర దర్యాప్తు సంస్థలను పావులుగా వాడుకుంటోందని విమర్శించారు. తక్షణం కేసులు ఉపసంహరించుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

### అప్రిలియో టుయోనో 457 బైక్ విడుదల



బైక్ విడుదల చేస్తున్న డీటీసీ మురళీమోహన్, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : నికీ మోటార్స్ షోరూంలో బుధవారం సరికొత్త అప్రిలియా టుయోనో బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు . జిల్లా రవాణా అధికారి మురళీమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేసి బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిమెస్టిక 2డబ్ల్యూ బిజినెస్ పియాజియో వెహికల్స్ ప్రైవేట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ రఘు వంశీ మాట్లాడుతూ సంచలనాలు సృష్టించిన అప్రిలియా టుయోనో 457ను విడుదల చేయడం సంతోషకరమన్నారు. ఫిరానా రెడ్, ఫ్యూమా గ్రే రంగులలో ఈ బైక్ అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ బైక్ షోరూం ధర రూ.3,96,149 అని, రూ.10వేలు చెల్లించి బైక్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పియాజియో రీజినల్ మేనేజర్ క్రాంతికుమార్, డీలర్ నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. తెలుగు లో కె.శరత్ ప్రథమ బహుమతి, హసన్ వలీ ద్వితీయ బహుమతి, అభిషేక్ తృతీయ బహుమతి, ఇంగ్లిష్‌లో సాయి అఖిల్ ప్రథమ బహుమ తి, జగదీశ్వర్ రెడ్డి కన్సొలేషన్ బహుమతి పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ మల్లికార్జున, భీమన్న అభినందించారు

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థులతో డీవైఈఓ కె.బాలాజీ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని డాక్టర్ డి.రామానాయుడు నగరపాలక ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీవైఈఓ కె.బాలాజీ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు దైవంతో సమానమని తెలిపారు. ప్రాథమిక విద్యే పిల్లల భవిష్యత్‌కు సోపానమని వెల్లడించారు. శ్రీమహారాజా డెకర్స్ అధినేత కొల్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కోరారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పతకాలు, బహుమతులు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈఓ బి.భాస్కర్‌నాయక్, ఎంజీఎం హైస్కూల్ హెచ్‌ఎం మునిశారద పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరాముని సేవలో ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు

తిరుపతి రూరల్ : మండలంలోని సీ.గొల్లపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా బుధవారం శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తలకు విందు భోజనం ఏర్పాటు చేశారుఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ విడుదల రవి పాల్గొన్నారు. అలాగే సాయంత్రం శ్రీరాములువారి ఉత్సవ మూర్తిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, జానకీరామ్ రెడ్డి, మహేష్, కిరణ్, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

### 27 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 27 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు.

# గుట్టకాయ స్వాహా!

బండమాకులగుట్టపై అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణం



సర్వే నంబర్ 96లో నిర్మిస్తున్న ఇల్లు



టీడీపీ నేతలు బరితెగించేశారు. ఇంతకాలం అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ కొండలు.. గుట్టలను కరగదీశారు. ఆయా ప్రాంతాలను చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలెట్టేశారు. ఇష్టారాజ్యంగా ప్లాట్లు వేసి యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. గుట్టలను కొల్లగొట్టి రూ.కోట్లు స్వాహా చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఇదే అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

- యథేచ్ఛగా కబ్జా చేసిన టీడీపీ నేతలు
- దర్జాగా ప్లాట్లు వేసి విక్రయాలు
- రామాపురంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం చుట్టుగుంట రామాపురం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 96లో 70 ఎకరాల గుట్ట, 90/1లో ప్రభుత్వ భూమి (బండమాకుల గుట్ట) 0.90 ఎకరాలను కొందరు టీడీపీ నేతలు దర్జాగా కబ్జా చేశారు. ఇప్పటికే 90/1లోని భూమిని ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించినట్టుగా ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసినప్పటికీ ఆక్రమణదారులు లెక్కచేయడం లేదు. కబ్జా చేసిన భూమిలో అక్రమ కట్టడాలు చేపట్టారు. రూ.కోట్ల విలువైన భూములను



అక్రమంగా గుట్టను తవ్వి చదును చేసిన దృశ్యం

స్వాహా చేస్తున్నా.. రెవెన్యూ అధికారుల్లో చలనం లేక పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

**రూ.కోట్ల భూములు కనుమరుగు**

సి.రామాపురం గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 90/1, 96లలో సుమారు రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారులు ఇప్పటికే కాజేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోక పోగా భూ ఆక్రమణ దారులకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయనంత వరకు ఆక్రమిత భూమిలో కేవలం చదును పనులు మాత్రమే చేశారు. ఫిర్యాదు అనంతరం ఇళ్ల నిర్మాణాలు చేపట్టారంటే అధికారుల సహకారం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శిస్తున్నారు.

**అడిగేవారే లేరా..?**

గుట్టలు, కొండలు, ప్రభుత్వ భూములను టీడీపీ నేతలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినా అడ్డుకునేవారే లేరా అంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారం అండతో ప్రకృతి వనరులను ధ్వంసం చేయడంపై రగిలిపోతున్నారు. ఈ క్రమంలో దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ అన్వర్‌బాషాను వివరణ కోరగా.. ఆ భూమిలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి పట్టాలు ఉన్నాయని చెప్పారు. పట్టా లేకుండా ఇల్లు కడితే తొలగిస్తున్నామని వెల్లడించారు. అయితే పట్టాలు ఎవరు మంజూరు చేశారనే విషయం తనకు తెలియదని సమాధానమివ్వడం గమనార్హం.

## పేదల ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వండి

- ఆలస్యం చేస్తే ఆందోళన చేపడతాం
- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీకి వినతి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల పరిధిలో నిరుపేదలు నిర్మించుకునే ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని ఎస్పీడీసీఎల్ సీఎండీకి విన్నవించినట్టు తిరుపతి రూరల్ ప్రజాప్రతినిధులు మీడియాకు తెలిపారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును బుధవారం తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, తుమ్మలగుంట సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ బుజమ్మ, గాంధీపురం సర్పంచ్ లక్ష్మీ, మన్నూరు శివ తదితరులు కలసి వినతి పత్రం అందించారు. ప్రధానంగా గాంధీపురం , అవిలాల, సాయినగర్, లింగేశ్వరనగర్, తుమ్మలగుంట, పేరూరు, వేదాంతపురం, మల్లంగుంట గ్రామ పంచాయతీల్లో చాలామంది పేదలు ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకుని విద్యుత్ మీటర్ల కోసం ఎదురుచూస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలియజేశారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి ఇంటి నిర్మాణాలు పూర్తిచేసినా విద్యుత్ సరఫరా లేక అష్టకష్టాలు పడుతున్నారని, వారందరికీ తక్షణం విద్యుత్తు మీటర్లు మంజూరు చేయాలని కోరారు. పలు చోట్ల విద్యుత్ సరఫరా లేకుండా చీకట్లో జీవనం సాగిస్తూ చీకట్లో తెలియకుండా విష సర్పాల కాట్లకు బలవుతున్నారని తెలియజేశారు. ఈ మేరకు స్పందించిన సీఎండీ సంతోషరావు తప్పకుండా ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారందరికీ విద్యుత్తు మీటర్లు అందించి సరఫరా అందజేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అలా కాకుండా ఆలస్యం చేస్తే ఆందోళనకు సిద్ధమవుతామని తెలియజేసినట్టు వివరించారు.



ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో నేతలు

## సున్నితమైన అంశం.. అప్రమత్తం

తిరుపతి రూరల్ : గోవుల విషయం సున్నితమైందని, అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. బుధవారం తుమ్మలగుంట సమీపంలోని ఎస్వీ గోశాలను సందర్శించారు. గోవులకు అందిస్తున్న దాణా, మేత అందించే తీరును అడిగి తెలుసుకున్నారు. నారాయణ మాట్లాడుతూ టీటీడీ విషయంలో రాజకీయాలకు తావు లేకుండా వాస్తవాలను ఒకటికి, రెండు సార్లు పరిశీలించుకుని మాట్లాడాలని కోరారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు సరికాదన్నారు. గోశాలలో ప్రస్తుతం గోవుల సంరక్షణ సంతృప్తికరంగానే ఉందన్నారు. అయితే నిర్వహణలో లోపాలను టీటీడీ సరిచేయాలని సూచించారు. గోశాలలో పనిచేస్తున్న టైం స్కేల్, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి జిల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, కత్తి రవి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



గోశాలను పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

## విద్యార్థులను ముంచిన ప్రభుత్వం

తిరుపతి సిటీ : ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక విద్యార్థి విభాగ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఫీజు బకాయిలు చెల్లించని కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులకి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతుంటే విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. సెమిస్టర్ వారీగా ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తుంటే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశారని వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెంగల్ రెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థలను కూటమి ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నేతలు తేజేశ్వర్ రెడ్డి ,మధుసూదన్, ముబారక్,రాజశేఖర్ రెడ్డి ,ప్రవీణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓబుల్‌రెడ్డి

## వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

చంద్రగిరి : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి మండల కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడిగా కొటాల చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్ యాదవ్, ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా బాలకృష్ణ, మురగయ్య, గోపాల్ యాదవ్, ఆర్ఎస్ మస్తాన్, సెక్రటరీలుగా బీకే వినోద్, అంజాద్‌బాషా, మాతయ్య, మోహన్ నాయుడు, రాజమునీంద్ర, సిద్దిక్ బాషా, సభ్యులుగా వి.గురవారెడ్డి, బద్వేల్ నాగరాజ, మునిరాజ, నాగభూషణంరెడ్డి, అనందయ్య, కృష్ణమూర్తి నాయుడు, శివకోటి, బాలాజీ, రాజయ్య నియమితులయ్యారు.

**గ్రామ కమిటీ అధ్యక్షులు:** వైఎస్సార్‌సీపీ పనపాకం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వెంకటరత్నం, కల్‌రోడ్డుపల్లి - రమేష్, ఎం.కొంగరవారిపల్లి - రెడ్డప్ప, ఐతేపల్లి- రాజశేఖర్, కొటాల - రమేష్‌రెడ్డి, ఏ.రంగంపేట -శేషు రెడ్డి, చిన్నరామాపురం -కె.మదన్ మోహన్ రెడ్డి, కందులవారిపల్లి - పవన్ కుమార్ రెడ్డి, రామిరెడ్డిపల్లి -దేవరాజులు, మిట్టపాళెం - శ్రీనివాసులు రెడ్డి బుచ్చినాయుడుపల్లి - వెంకటేశ్వర్లు (బుజ్జిబాబు), రెడ్డివారిపల్లి - ప్రకాష్ రెడ్డి, రాయలపురం- కత్తి హరి, దోర్నకంబాల- రవీంద్రనాథ్ రెడ్డి, గంగుడుపల్లి - కేపీ గంగిరెడ్డి, శానంబట్ల -నరసింహా రెడ్డి, పిచ్చినాయుడుపల్లి- మునికృష్ణయ్య, తొండవాడ -నాగ వినయ్, నరసింగాపురం- ప్రవీణ్ కుమార్, అగరాల - పాలపాటి చిరంజీవి, చంద్రగిరి - ఓ.శివశంకర్ రెడ్డిని నియమిస్తూ పార్టీ ఆదేశాలను జారీ చేసింది.

**అనుబంధ విభాగాలకు అధ్యక్షులు వీరే..**

వైఎస్సార్‌సీపీ మండల యూత్ వింగ్- రామ్ తేజ్, మహిళా విభాగం- కుసుమ కుమారి, రైతు విభాగం- మదన్‌మోహన్ రెడ్డి, బీసీ సెల్-శంకర్ యాదవ్, ఎస్సీ సెల్- అజయ్ కుమార్, ఎస్టీ సెల్- వెంకటేష్, మైనార్టీ సెల్- ఔరంగజేబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్- సాల్మన్ రాజ్, స్టూడెంట్ -వినోద్(సుదర్శన్), పంచాయతీరాజ్ - వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌టీఐ-మునికృష్ణ, వాలంటరీ-సూరి, వాణిజ్య- కిషోర్, వైఎస్సార్‌టీయూసీ- బాలాజీ ఆచారి, అంగన్‌వాడీ- ఒడుగు లక్ష్మి, సాంస్కృతిక- గురుమూర్తి యాదవ్, సోషల్ మీడియా- పఠాన్ రహీం, దివ్యాంగుల విభాగం- వాసు, పబ్లిసిటీ - ప్రసాద్ రెడ్డి, ఐటీ- మోనీష్ రెడ్డి, బూత్ కమిటీ- డి. మాధవ రెడ్డి నియమితులయ్యారు.

### అగ్నిప్రమాదాలపై అవగాహన

తిరుపతి క్రైమ్ : అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఫైర్ యాక్సిడెంట్ సంభవిస్తే చేపట్టాల్సిన చర్యలపై బుధవారం నగరంలోని రామకష్ణ డీలక్స్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు.

### రాయితీ రుణాలకు దరఖాస్తులు

పాకాల : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై అందించే రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అరుణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 21 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు ఎస్సీలు దరఖాస్తుకు అర్హులని వెల్లడించారు. మే 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అడుగులు

తిరుపతి తుడా: ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మహిళలు అడుగులు వేయాలని కమిషనర్ మౌర్య కోరారు. బుధవారం శ్రీకాళహస్తి లోని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్ , శ్రీకాళహస్తి పైప్స్ కంపెనీ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు ముగింపు కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ప్రస్తుతం బ్యూటీషియన్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కంపెనీ ఈడీ సురేష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ తమ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు వంటి వాటిలో మహిళలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందించారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం దొరైరాజ్, డిప్యూటీ సీఓఓ రాజీవ్ ప్రకాశ్ పాల్గొన్నారు.



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కమిషనర్ మౌర్య

**త్వరితగతిన డ్రైనేజీల నిర్మాణం**

కొర్లగుంట బైపాస్ రోడ్డులో ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం 33 వ వార్డులోని స్కావెంజర్స్ కాలనీ, కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద డ్రైనేజీ కాలువల నిర్మాణం, రోడ్ల గుంతల పూడ్చివేత పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో చెత్తకుప్పలు లేకుండా నిత్యం శుభ్రం చేయాలని సూచించారు. దోమలు పెరగకుండా ప్రతిరోజూ ఫాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ రాజు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.

### సత్కారం



రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవం వేడుకలు ర్వహించారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రంగస్థలి నటులు కేఎన్.రాజా, పొన్నాల జేజిరెడ్డి, కన్నప్ప గారి కేశవులురెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీధర్‌ను వీరేశలింగం పంతులు అవార్డుతో ఘనంగా సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి , కళాకారులు ఫణిభూషణ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు. - తిరుపతి కల్చరల్

### పురస్కారం



ఎస్వీయూ ఇంగ్లిష్ విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ షేక్ ఫాతిమాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభ అవార్డు వరించింది. ఈ మేరకు బుధవారం గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో దక్షణ ప్రైవేటు అధ్యాపకులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. పలువురు అభినందించారు. - తిరుపతి సిటీ

### స్వాగతం



తిరుమల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రాయానికి విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ గాడ్సేకు ఘన స్వాగతం లభించింది. జాతీయ సంస్కృత వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చందులాల్, ఏపీఆర్ఓ డాక్టర్ కనపాల కుమార్ పుష్పగుచ్ఛం అందించారు. మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య లలిత కుమారి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ యువశ్రీ సాదరంగా ఆహ్వానం పలికారు. -తిరుపతి సిటీ

### నోటీస్ బోర్డు

- ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సైన్స్ గ్రూప్ కోర్సుల 4వ సెమిస్టర్.
- కలెక్టరేట్ వద్ద ఉదయం 10.30 గంటలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన.
- కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 3.15 వరకు గ్రామీణ సంస్థ ప్రతినిధులతో, 3.15 నుంచి 4 గంటల వరకు అర్బన్ స్థానిక సంస్థ ప్రతినిధులతో, 4 నుంచి 4.45 గంటల వరకు వాణిజ్య, పరిశ్రమల ప్రతినిధులతో అసెంబ్లీ పద్దుల కమిటీ సమావేశాలు.

### కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

తిరుపతి అర్బన్ : తిరుపతి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన భక్తవత్సలం బుధవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధ్యతగా పనిచేయాలని, అందరికి అందుబాటులో ఉండాలని సూచించారు.

### వైభవంగా సీతారాముల కల్యాణం

తిరుపతి రూరల్ : తిరుచానూరులోని పురాతన రామాలయంలో బుధవారం వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మావతి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సేవ సమాజం అధ్యక్షుడు టి.సతీష్ కుమార్, సెక్రటరీ సతీష్, కోశాధికారి రవి చంద్రగుప్త, ఆర్యవైశ్య యువకిరణాలు అధ్యక్షుడు కల్యాణ్, సెక్రటరీ సాయిరాం కోశాధికారి అనుదీప్, పెద్దలు జీకే ,తారక , మహిళా మణులు ఇందిరా, కుమారి, అపర్ణ, రెడ్డమ్మ పాల్గొన్నారు

### సప్తగిరికి పలువురి పరామర్శ

తిరుపతి రూరల్ : తిరుచానూరు సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సినీ నటుడు సప్తగిరి తల్లి చిట్టెమ్మ కర్మక్రియలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు అక్కడకు చేరుకుని సప్తగిరిని పరామర్శించారు. చిట్టెమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వీరిలో ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, గురజాల జగన్‌మోహన్, పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, శ్రీధర్‌వర్మ ఉన్నారు.

### అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్ : అవగాహనతో ప్రాణాంతక క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని టాటా ట్రస్ట్ ఆస్పత్రి కో- ఆర్డినేటర్ హేమంత్‌కుమార్ తెలిపారు. బుధవారం గాలివీధిలోని రాస్ క్లస్టర్‌లో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు బీపీ, షుగర్, హెపటైటీస్, క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. రాస్ సిబ్బంది డి.నాగరాజు, విజయలక్ష్మి, క్లస్టర్ లీడర్లు శారద, విజయకుమారి, ముంతాజ్ పాల్గొన్నారు.

### ఏలుమలైరెడ్డికి పరామర్శ



ఏలుమలైరెడ్డిని పరామర్శిస్తున్న మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : తిరుచానూరు పంచాయతీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరేష్ రెడ్డి తండ్రి ఏలుమలైరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం తిరుపతి మదర్ ఆస్పత్రిలో ఆయనను వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఏలుమలైరెడ్డికి మెరుగైన చికిత్సలు అందించాలని సూచించారు.

**అనసూయమ్మకు నివాళి**

తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తల్లి సి.అనుసూయమ్మ కర్మక్రియలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి అనసూయమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.



పుష్పాంజలి ఘటిస్తున్న మోహిత్‌రెడ్డి

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరుపతి : 99516 02971
చంద్రగిరి : 95055 17845